## క్లుప్తంగా

### నేడు రొంపిచర్లలో వన సమారాధన

రొంపిచర్ల: స్థానిక శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శ్రీ శంకర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వన సమారాధన కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో స్వామివారిని ప్రత్యేక అలంకరణ, పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. అదే విధంగా మాలలు ధరించిన అయ్యప్ప స్వాములకు, కనకదుర్గ స్వాములకు, ఇతర స్వాములకు ప్రత్యేకంగా చద్ది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

### ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోండి

చిలకలూరిపేట: డ్వాక్రా గ్రూపుల సభ్యులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. పురపాలకసంఘ పరిధిలోని మెప్మా విభాగం ద్వారా స్వయంసహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధి కార్యక్రమాల శిక్షణకు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ యాప్ ద్వారా సంఘ సభ్యుల వివరాలు సేకరించి ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. పట్టణపరిధిలోని స్వయంసహాయక సంఘాల సభ్యులందరూ తమ వివరాలను సంబంధిత ఆర్పీలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

### రెడ్డిపాలెంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

బొల్లాపల్లి : పునీత ఫ్రాన్సిస్ శౌరివారి మహోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు డిసెంబరు 1 నుంచి 3 వరకు నిర్వహిస్తున్నట్లు రెవ.ఫాదర్ యన్నం జాకోబ్‌రెడ్డి గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనదలచిన వారు ముందు ఎంట్రీ ఫీజు రూ.100లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యం కలదని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ (రూ.20,116), ద్వితీయ (రూ.15,116), తృతీయ (రూ.12,116), నాల్గవ (రూ.7,116) బహుమతులు అందజేశారని తెలిపారు. పాల్గొనదలచిన జట్లు సీహెచ్. రాజేశ్వరరావు, కె.ప్రకాశరావు 9492082098, 8179041557 సంప్రదించాలని కోరారు.

### దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ

నరసరావుపేట: పట్టణంలోని 20 మంది నిరుపేద దివ్యాంగులకు ఒక్కొక్కరికి 11రకాల నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు గుడ్‌హార్ట్ దివ్యాంగుల సోషల్ సర్వీసు వ్యవస్థాపక అధ్యక్షులు పి.పవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పాత చెక్ పోస్టు సమీపంలోని తన కార్యాలయంలో వారందరికీ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మల్లవరపు బాబుమాదిగ, వెంకట్రావు. వెంకటేశ్వర్లు. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

### నేడు సీఆర్ కళాశాలలో జాబ్‌మేళా

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య తెలిపారు. ఉదయం 9 – సాయంత్రం 4 గంటల వరకూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు నాలుగు కంపెనీలు తరలిరానున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాను పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాస్టర్ మైండ్స్, రుద్ర కార్పొరేట్ సర్వీసెస్, సింధుజ మైక్రో క్రెడిట్, కపిస్టన్ సర్వీసెస్ కంపెనీల నుండి ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమా, ఫార్మసీ, పీజీ వంటి అర్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకూ వేతనం అందిస్తారన్నారు. 18-50 ఏళ్ళలోపు నిరుద్యోగులైన యువతీయువకులు బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

### పేకాట శిబిరంపై దాడి

నరసరావుపేట రూరల్: లింగంగుంట్లలోని పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రూ.72,100లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని శ్రీ లక్ష్మీ విజయ పార్కింగ్ రూంలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ కిశోర్ తన సిబ్బందితో దాడి చేశారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

### రేపు పోస్టాఫీస్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

చిలకలూరిపేట: పోస్టాఫీస్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఉదయం 11.30కు నిర్వహిస్తున్నట్లు నరసరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి తెలిపారు. తహసీల్దార్ ఆఫీసు వెనుక వైపు పోస్టల్ డిపార్ట్‌మెంటుకు చెందిన స్థలంలో ఈ కార్య క్రమం నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిధిగా కేంద్ర కమ్యూనికేషన్ల, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, తపాల శాఖ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె ప్రకాశ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

# వసతి గృహాల్లో నరకయాతన!

- 130 మందికి మూడే మరుగుదొడ్లు!
- లోపించిన పారిశుద్ధ్యం
- వినుకొండలో శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర వసతిగృహం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు


శిథిలావస్థకు చేరిన వసతి గృహం

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాలు విద్యార్థుల పాలిట నరకకూపాలుగా తయారయ్యాయి. వినుకొండలో ఉన్న వసతిగృహాలు మరీ దారుణంగా ఉన్నాయి. 20 ఏళ్ల క్రితం స్థానిక రైల్వేస్టేషను రోడ్డులో ఉన్న ఎస్సీబాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవటంతో అక్కడ ఉన్న 70 మంది విద్యార్థులను సిద్ధార్థా నగర్‌లోని కళాశాల వసతిగృహానికి మార్చారు. అయితే అక్కడ ఇంటర్, ఐటీఐ, డిగ్రీ విద్యార్థులు 60 మంది మొత్తం 130 మంది వరకూ ఉండటంతో విద్యార్థులకు వసతి సక్రమంగా లేక నరకయాతన అనుభవిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు గతంలో ఉన్న భవనంలో 9 గదులు ఉండగా ఇక్కడ మాత్రం కేవలం 4 గదులు కేటాయించారు. విద్యార్థులు ఒక్కో గదిలో 25 మంది వరకూ ఉండటంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు వసతిగృహంలో కేవలం 3 మరుగుదొడ్లు మాత్రమే పనిచేస్తున్నాయి. కనీసం మరుగుదొడ్లు కూడా బాగు చేయకపోవటంతో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో విద్యార్థులు రోగాలబారిన పడుతున్నారు. అలాగే విద్యార్థులకు కనీసం కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వకపోవటంతో ఎవరికి వారే సబ్బులు, కొబ్బరినూనె, ఇతర వస్తువులు కొనుక్కోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. ప్రస్తుతం అద్దెభవనంలో వసతి గృహాన్ని నడుపుతున్నారు. దీంతో ఇక్కడ విద్యార్థులకు కనీస భద్రత లేకుండా పోయింది. నూతన భవనాలు నిర్మించి వసతి సౌకర్యాలు కల్పిస్తే తప్ప విద్యార్థులకు కష్టాలు తప్పేటట్టు లేదు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి నూతన భవనాలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


హాస్టల్ ప్రాంగణం ఇదే...

## వేర్వేరుచోట్ల బాల్య వివాహాల నిరోధంపై ప్రచారం


సాతులూరులో ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు, విద్యార్థినులు


వంకాయలపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నాదెండ్ల: బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ చెప్పారు. సాతులూరు సచివాలయం వద్ద గురువారం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైనంత వరకూ ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలని కోరారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, వారి కలలను నిర్వీర్యం చేస్తాయన్నారు. బాలికల విద్య, భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు లేని రాష్ట్ర సాకారానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, కిశోర బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచారం**

యడ్లపాడు: బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని వంకాయలపాడులో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వంకాయలపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం జోజమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని ఫ్లకార్డుతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేశారు. అనంతరం కిషోర బాలికలకు, తల్లుల కమిటీ సభ్యులకు బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను గురించి వివరించారు.

### దోమలతో అప్రమత్తంగా ఉండాలి

నరసరావుపేట: దోమలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీటి నివారణకు పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడం ద్వారానే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం పట్టణంలోని ఒకటో వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వార్డులో సిబ్బంది, కార్యకర్తలను వెంటబెట్టుకుని తిరుగుతూ చీపురుపట్టి రోడ్లు ఊడ్చారు. మునిసిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# నందీశ్వరునికీ ప్రత్యేకాభిషేకాలు


ప్రదోష సమయంలో నందీశ్వరునికి జరిగిన అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో వల్లభేశ్వరస్వామి (విప్పర్ల)

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కమలాంబిక సమేత చంద్రమౌళీశ్వరి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని వనసమారాధన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి సహిత మహామృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వనసమారాధన కార్యక్రమంలో వందలాది మంది గ్రామస్తులు పాల్గొన్నారు. హోమ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం రుక్మిణి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు పాల్గొన్నారు. అలాగే విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో కార్తిక త్రయోదశిని పురస్కరించుకుని ప్రదోష సమయాన నందీశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వల్లభేశ్వర శర్మ నిర్వహించగా పలువురు భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

# సంచార వాహనాలతో పశువైద్యం అందించాలి

**ప్రజాసంఘాల నాయకుల వినతి**


ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: సంచార వాహనాల ద్వారా పశువులకు వైద్యం అందించాలని ప్రజాసంఘాల నాయకులు ఏడీఏ రామచంద్రరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. పెద్దచెరువులోని పశువుల ఆసుపత్రిలోని పశుసంవర్ధక శాఖ డివిజన్ కార్యాలయంలో ఏడీఏను పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావులు కలిసి రైతుల సమస్యలను తెలియజేశారు. సంచార వాహనాల ద్వారా గతంలో పశువులకు వైద్యం అందించేవారని తెలిపారు. ప్రస్తుతం సంచార వాహనాలు సక్రమంగా గ్రామాలకు రావడం లేదన్నారు. దీనిపై రైతులకు అధికారులకు తెలియజేస్తే మొబైల్ ద్వారా సమస్యను తెలియజేస్తే వస్తామని చెబుతున్నారని వివరించారు. దీని వలన గ్రామాల్లోని పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పశుసంపద పెరగాలంటే పశువులకు వస్తున్న వ్యాధులను గుర్తించి సకాలంలో వైద్యం అందించాల్సిన ఉందన్నారు. ప్రభుత్వం దీనిని విస్మరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ పరంగా వైద్యం, మందులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# ఇంటింటి సర్వే పురోగతి వేగవంతం చేయాలి

**ఎంపీడీవో సీతారామయ్య**


కారుమంచిలో సర్వే పురోగతిని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: ఇంటింటి సర్వే కార్యక్రమం గ్రామ సచివాలయ సిబ్బంది పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో నివాస గృహాలు 13 వేల 103 ఉండగా 10వేల నివాస గృహాలను సర్వే చేసినట్లు తెలిపారు. ఈసర్వే వలన ప్రభుత్వ పథకాలు అర్హత పొందటానికి, అలాగే ఆయా గ్రామాలకు చెందిన వారిగా గుర్తింపు పొందుతారన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కుటుంబ సభ్యులు సమగ్ర వివరాలు ప్రభుత్వం ఆన్‌లైన్ గుర్తింపుకు దోహదపడుతుందన్నారు. గ్రామసచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఇంటి యజమాని సమగ్ర వివరాలు ఇంటిలోని సభ్యులు అడిగి తెలుసుకొని ఆన్‌లైన్ నమోదుతో పాటు బయోమెట్రిక్ చేస్తారన్నారు. వలసలు వెళ్లిన వారి వివరాలు, మృతి చెందిన వారి వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈసర్వే కార్యక్రమానికి ప్రజలు సచివాలయ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈనెలఖారులోగా నూరుశాతం పూర్తయ్యేలా సచివాలయ సిబ్బంది బాధ్యత వహించాలన్నారు.

# రైతులను భయపెడుతున్న వాతావరణం


ఇప్పుడే కంకులు ఈనుతున్న వరిపైరు

రొంపిచర్ల: గత రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల మాగాణి వరి రైతాంగం ఆందోళన చెందుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మండలంలో తక్కువ విస్తీర్ణంలో వరి కంకులు ఈనీ మరో 10 రోజుల్లో కోతకు సిద్ధమవుతోంది. కోతకు సిద్ధమైన వరి పైరుకు వాతావరణం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇప్పుడిప్పుడే కంకులు ఈనుతున్న వరిపైరుకు, పొట్టదశలో ఉన్న వరిపైరుకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణం ఇలానే కొన్ని రోజుల పాటు కొనసాగితే వరిలో కంకినల్లి ఆశించే అవకాశం ఎక్కువగా కనపడుతుంది. మానుకాయ కూడా ఆశిస్తుందని రైతులు వాపోతున్నారు. అయితే వరిలో కంకినల్లి నివారణకు ప్రొఫెనోఫోస్ 400 ఎం.ఎల్., స్పైరోమెసిఫెన్ 200 ఎం.ఎల్., ప్రోపర్గైట్ 400 ఎం.ఎల్. మందులను పిచికారి చేయాలన్నారు. వరిలో కంకినల్లి నివారణకు పై మందుల్లో ఏదో ఒక మందును తీసుకొని ఎకరా విస్తీర్ణానికి పిచికారి చేసి నివారించవచ్చని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏలు రైతులకు సూచిస్తున్నారు.

# విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

అమరావతి: పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఐ.చంద్రకళ పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింగాపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గది వాతావరణం, భోధన విధానం పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన నైపుణ్యాన్ని పరీక్షించారు. 10వ తరగతి విద్యార్థుల నోట్ బుక్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన ప్రమాణాలను విశ్లేషించడానికి స్లిప్ పరీక్షలు, 3, 4 తరగతుల విద్యార్థులకు పఠన పరీక్ష నిర్వహించాలని సూచించారు. అనంతరం సమావేశం నిర్వహించి సిబ్బంది, ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలకు హాజరుకావాలని స్పష్టం చేశారు. నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ప్రతి తరగతికి సబ్జెక్ట్ వారీగా వారి ట్రాక్ రికార్డ్‌ను నిర్వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాల్లో మరుగుదొడ్ల పరిశుభ్రత సక్రమంగా నిర్వహించాలని ఆయాలకు సూచించారు. ఈ కార్యక్మరంలో ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, శివబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# జ్యోతీరావు పూలేకు ఘన నివాళి


పల్నాడురోడ్డులో నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ


రొంపిచర్లలో నివాళి అర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు


చిలకలూరిపేటలో నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు


చిలకలూరిపేటలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నరసరావుపేట: సమాజంలో అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళాభ్యుదయం, అణగారిన వర్గాల విద్యావ్యాప్తికి కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలేనని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొనియాడారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా పల్నాడు బస్టాండు వద్ద ఉన్న విగ్రహానికి పలువురు బీసీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పూలే తన సహచరి సావిత్రిబాయి పూలేతో కలిసి దేశంలోనే మొట్టమొదటి' బాలికల పాఠశాలను స్థాపించి అందులో తొలి మహిళా ఉపాధ్యాయినిగా తన భార్యతోనే బోధింపజేశారన్నారు. పూలే తన అనుచరులతో దిగువ కులాల ప్రజలకు సమాన హక్కుల కోసం 'సత్య శోధక్ సమాజ్' సంస్థను ఏర్పాటు చేసి, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేశారన్నారు. మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా తన జీవితాంతం పోరాడారన్నారు. అన్నీ రంగాల్లో బీసీ లు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. వారి అభివృద్ధి కోసం ఒక బీసీ ఎమ్మెల్యేగా తనవంతు కృషిచేస్తానని చెప్పారు. బీసీ సంక్షేమసంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, డాక్టర్ రాంప్రసాదు, పట్టణ అధ్యక్షులు కొల్లిపర బాలాజీ, మండల అధ్యక్షులు నాగారపు గురు ఆంజనేయులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు విశ్వేశ్వరరావు, వడ్డెర సంఘం నాయకులు బత్తుల సెల్వరాజ్, దమ్మాటి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెనుకబడిన కులాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎస్.తిమ్మరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు కోనేటి నరసింహారావు, ముక్కడాల వెంకటేశ్వరరావు, చక్రవరం సత్యనారాయణరాజు, జొన్నలగడ్డ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: తొలితరం సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని పూలే చైతన్య సేవాసంఘం అధ్యక్షుడు ఉప్పాల భాస్కరరావు చెప్పారు. జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని గడియారస్తంబం సెంటర్‌లో ఉన్న జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి గురువారం నివాళులు అర్పించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మద్దుల వెంకటకోటయ్య మాట్లాడుతూ మహిళలు విద్యనభ్యసించటం ద్వారా వారిలో చైతన్యం వస్తుందని భావించి తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆమెచే తొలి బాలికా విద్యాలయం నెలకొల్పారని వెల్లడించారు. కొమరవల్లిపాడు వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి పూలే ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, నాయుడు శివకుమార్, గుంజి పద్మ, ఉండవల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలలో జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పూలే జీవిత విశేషాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

# తెగుళ్లు ఆశించకుండా ఇలా చేయండి

**ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి**


చెంఘీజ్‌ఖాన్‌పేటలో పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న డీపీఎం కె అమల కుమారి

యడ్లపాడు: ప్రీ మాంసో డ్రై షోయింగ్ విధానంతో పంటకు ఎటువంటి తెగుళ్లు ఆశించవని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం కె.అమలకుమారి చెప్పారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామా న్ని సందర్శించిన ఆమె స్థానికంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంటపొలాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో అంతరపంటల సాగుని చేపట్టిన రైతుల సమస్యల్ని తెలుసుకుని పలు సలహాలు, సూచనల్లు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రత్తిలో ప్రధానంగా ప్రత్తిపొలాల్లో సాలుకు ఒక సాలు కంది సాలు పెట్టుకుంటే అది పంటకు రక్షణ కవచంలా తెగుళ్ల నుంచి కాపాడుతుందన్నారు. అలాగే బోర్డర్ క్రాప్‌గా మూడు వరసలు జొన్న, సజ్జ వేసుకోవాలి. ప్రత్తి సాలు కు ప్రత్తి సాలు కు మధ్యలో సజ్జ, గోరు చిక్కుడు, బెండ, మినుము, పెసర, అలసందలు రెండు రెండు వరసలుగా వేసు కోవాలన్నారు. ప్రత్తి మొక్కకు మొక్కకు మధ్యలో ఆకు కూరలను సాగు చేసుకోవాలని సూచించారు. కేవలం ఒకే పంటగా కాకుండా వాణిజ్య పంటలోనూ ఇలా అంతరపంటలు సాగు చేసుకోవడం వలన జీవ వైవిధ్యం ఏర్పడి భౌగోళిక లక్షణాలు మెరుగు పడతాయన్నారు. తద్వారా రసాయన ఎరువులు వేయవలసి అవసరం ఉండదని తెలి పారు. ఇందుకు ఉదాహరణగా స్థానికంగా సాగు చేసిన జ్యోతి పంటపొలాన్ని సందర్శించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్: భూమి 365 రోజులు పంటలతో కప్పి ఉంచడం ద్వారా నిరంతర కర్బన పదార్థం చేకూరి భూమి త్వరగా సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. రాష్ట్రస్థాయి శిక్షణ పొందిన వారితో పిడుగురాళ్ల డివిజన్ సిబ్బందికి శిక్షణ తరగతులు గురువారం పట్టణంలోని అంజిరెడ్డి సమావేశ మందిరంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా తొమ్మిది సార్వత్రిక సూత్రాల్లో రెండు సూత్రాలను సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ నిరంతరం పంటలతో కప్పి ఉంచడం వలన భూమి సారవంతం అవడంతో పాటు సూక్ష్మజీవుల వృద్ధి జరుగుతుందని తెలిపారు. భూమి వర్షానికి కోతకు గురికాదని, రైతులకు కలుపు ఖర్చు తగ్గుతుందని వివరించారు.

వర్షాభావ పరిస్థితుల్లో కూడా పంటలు బెట్టను తట్టుకుంటాయని తెలిపారు. అలాగే పంటల వైవిధ్యాన్ని పాటించాలని సూచించారు. ప్రతి రైతు క్షేత్రంలో 15 నుంచి 20 రకాల పంటలు ఉండే విధంగా వేయడం ద్వారా చీడపీడల ఉధృతి తట్టు కోవడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని తెలిపారు. రైతులు ఈ విధానాలు ఆచరించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావచ్చని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, డీపీఎంయూ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# సాతులూరులో అయ్యప్పనామ స్మరణ

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో అయ్యప్ప నామ స్మరణ మార్మోగింది. నలభై మంది అయ్యప్ప దీక్షాధారులు గురువారం శబరిమలైకు తరలి వెళ్ళారు. 41 రోజుల కఠిన దీక్ష అనంతరం గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, విఘ్నేశ్వరస్వామి ఆలయాల్లో ఇరుముడులు ధరించి శబరిమలైకు తరలివెళ్ళారు. గురుస్వాములు మేకల హరిబాబు మాలధారులకు ఇరుముడులు ధరింపచేశారు. రెండు ఆలయాల నుంచి మాలాధారులు గ్రామోత్సవంగా హైవే వద్దకు తరలివెళ్ళి ప్రత్యేక వాహనాల్లో శబరిమలైకు తరలారు.

### సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి


ప్రదీప్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని బెంగుళూరు సైబర్ క్రైం కౌన్సిలర్ కె.ప్రదీప్ తెలిపారు. రావిపాడురోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రదీప్ మాట్లాడుతూ, ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు ప్లేస్టోర్ నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఫోన్‌లోని డేటా మొత్తం నేరగాళ్ల చేతికి వెళుతుందని హెచ్చరించారు. ఆధార్, పాన్‌కార్డ్ వివరాలు ఎవరికీ చెప్పకూడదని తెలిపారు. సైబర్ నేరంపై అనుమానం కలిగితే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు పాల్గొన్నారు.